
సాక్షి
ఒడిశా
మంగళవారం, 9, జూలై, 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,02,027లు, వెండి 15 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



అద్వితీయం

రాష్ట్రవ్యాప్తంగా దేవదేవుడి రథయాత్ర రెండోరోజు సోమవారం కొనసాగింది.

- 8లో



ఒలింపిక్ క్రీడాకారులకు ప్రోత్సాహం

వచ్చే పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే రాష్ట్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహం సీఎం ప్రకటించారు.

- 8లో

న్యూస్‌రీల్

మాజీ సీఎం నవీన్‌ను కలిసిన నందో దంపతులు



నవీన్ పట్నాయక్‌తో నందో దంపతులు

కొరాపుట్: మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌ను మాజీ మంత్రి రబినారాయణ నందో దంపతులు భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జయపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఇందిరా నందో బీజేడీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. దీంతో తన ఓటమికి గల కారణాలు అధినేతకి వివరించారు. ఇదే స్థానం నుంచి రబినందో ఇదివరకు వరుసగా మూడుసార్లు గెలుపొంది, రెండుసార్లు ఓడిపోయారు.

'చయనిక' పుస్తకావిష్కరణ



చయనిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక డైట్ శిక్షణ కేంద్రంలో కమ్యూనికేషన్ సాహిత్య సంసద్ అధ్యక్షుడు యజ్ఞేశ్వర పండ అధ్యక్షతన ప్రముఖ కవి ఘాశీరాం మహాపాత్రో కలం నుంచి వెలువడిన కవితా సంపుటి 'చయనిక' పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ సురేష్ దాస్ మాట్లాడుతూ.. ఘాశీరాం రచనలు సమాజ చైతన్యానికి దోహదపడతాయన్నారు. చయనిక కవితలు పాఠకులను ఆలోచింపచేసేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. జయపురం సాహిత్య పరిషత్ అధ్యక్షుడు హరిహర కరసుధా పట్నాయిక్, పొరజాపతి సంస్థ కార్యదర్శి బిజయలక్ష్మీ పాణిగ్రాహి, డైట్ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ రూపచంద్ర సారేన్‌లు చయనిక పుస్తకాన్ని ఆవిష్కరించి, సమీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాంశు శేఖర పట్నాయిక్, కమ్యూనికేషన్ సంసద్ కార్యదర్శి ప్రకాశ మహానందియ, శోభారాణి నందో తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు వేద్దాం

- ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక



ఎమ్మెల్యే కద్రకను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

రాయగడ: జనాభా పరంగా అతివేగంగా అభివృద్ధి చెందుతున్న రాయగడ అభివృద్ధి వైపు అందరి సహకారంతో అడుగులు వేద్దామని ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక పిలుపునిచ్చారు. స్థానిక సాయిప్రియ నగర్‌లోని సాయిప్రియ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సన్మాన సభలో ఆయన ప్రసంగించారు. పట్టణాన్ని మరింత సుందరీకరణ చేయడంతో పాటు కొత్తగా ఏర్పడిన కాలనీలో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తనను గెలిపించిన ప్రజల కోసం తాను నిరంతరం శ్రమిస్తానని తెలియజేశారు. అంతకుముందు ట్రస్ట్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

బస్సు బోల్తా

- పది మందికి గాయాలు



బోల్తాపడిన ప్రైవేటు బస్సు

పర్లాకిమిడి: గజపతి జిల్లా అడవ పోలీసుస్టేషన్ పరిధి వులియాపద వద్ద రాయగడ నుంచి బరంపురం వెళ్తున్న ప్రైవేటు బస్సు అదుపు తప్పి బోల్తాపడిన దుర్ఘటనలో పదిమంది పాసింజర్లకు గాయాలయ్యాయి. కొద్ది దూరంలో లోయ ఉండగా త్రుటిలో అతిపెద్ద ప్రమాదం నుంచి ప్రయాణికులు బయటపడ్డారు. గాయపడిన ప్రయాణికులకు తొలుత మోహనా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. అడవ పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరీ తీరం.. భక్తజన సంద్రం



గుండిచా మందిరం ఆవరణలో నిలిచిన మూడు రథాలు



నందిఘోష్ రథంలో శ్రీజగన్నాథుని యాత్ర

- రెండో రోజు కొనసాగిన రథయాత్ర
- గుండిచా మందిరానికి చేరిన దేవదేవుడు
- పోటెత్తిన భక్తజనం

భువనేశ్వర్:

అశేష భక్తజనం జై జగన్నాథ నినాదాలు నడుమ తోబుట్టువులతో కలిసి దేవదేవుడు శ్రీజగన్నాథ స్వామి గుండిచా గమ్యం చేరాడు. కర్మక్షేత్రం శ్రీమందిరం నుంచి జన్మక్షేత్రం గుండిచా చేరడం యాత్ర సమగ్ర సారాంశం. గుండిచా మందిరం ఆవరణ శారదా బాలి ప్రాంగణంలో 3 రథాలు నిలిచాయి. రథాలపై దేవుళ్ల దర్శనం అపురూపమైనది. ఏటా రథయాత్ర పురస్కరించుకుని భక్తులకు ఈ అవకాశం లభిస్తుంది. శ్రీజగన్నాథ సంస్కృతి ప్రకారం రథాలపై ఉత్సవ పూజాదులను నిర్వహించి గుండిచా మందిరం గర్భగుడిలోకి తరలిస్తారు. ఈ మందిరంలో అడపా మండపంపై చతుర్థామూర్తులు కొలువుదీరి భక్తులకు దర్శనం ఇస్తారు. ప్రధాన ఆలయం నుంచి మూల విరాటులు బయటకు తరలి రావడం పూర్తిగా విభిన్నం. ఈ సందర్భంగా కుల, మత, వర్గ, వర్ణ వివక్షకు అతీతంగా సాక్షాత్తు భగవంతుడు సర్వ మానవాళితో మమేకం కావడం విశిష్టత.

53 ఏళ్ల తర్వాత

ఏటా రథయాత్ర పురస్కరించుకుని శ్రీజగన్నాథుని నేత్రోత్సవం మరియు నవ యవ్వన దర్శనం లభిస్తుంది. ఈ ఏడాది ఈ అవకాశం కొరవడింది. సుమారు 53 ఏళ్ల తర్వాత ఈ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రథయాత్ర వరుసగా 2 రోజులు నిరవధికంగా నిర్వహించారు. తొలిరోజు ఆదివారం లాంఛనంగా మూడు రథాలను లాగారు. సూర్య అస్తమయం గడువుగా యాత్రని మర్నాటికి పొడిగించారు. యాత్రకు రెండు రోజులు ముందుగా వేర్వేరుగా నిర్వహించాల్సిన నేత్రోత్సవం మరియు నవయవ్వన ఉత్సవం ఈసారి రథయాత్ర నాడు యాత్ర ఉత్సవాదులతో కలిపి నిర్వహించడంతో యాత్ర పొడిగింపు అనివార్యమైంది. ఇలా లోగడ 53 సంవత్సరాల క్రితం 1971లో జరిగింది.

శారదా బాలి చేరిన రథాలు

ఆదివారం యాత్ర ప్రారంభమైనా సూర్య అస్తమయం కావడంతో ముందుగా బయల్దేరిన బలభద్ర స్వామి రథం తాళ ధ్వజం మారీచ్‌కోట్ కూడలి, దేవీ సుభద్ర దర్ప దళనం రాజ నగరి ఆవరణ మరియు శ్రీజగన్నాథుని రథం నంది ఘోష్ శ్రీ మందిరం నుంచి అతి స్వల్ప దూరంలో ఆగిపోయాయి. సోమవారం ప్రాతః కాల సేవాదులు ముగించి ఉదయం 9.20 గంటల నుంచి రథాలు లాగడం మళ్లీ ప్రారంభించారు. తొలిరోజు మాదిరిగా రెండో రోజున కూడ భక్తులు అదే ఉత్సాహంతో 3 రథాలను వడివడిగా లాగి గుండిచా గమ్యం చేర్చారు. బలభద్రుని తాళ ధ్వజం మధ్యాహ్నం 12.35 గంటలకు, దేవీ సుభద్ర దర్పదళనం మధ్యాహ్నం 1.40 గంటలకు, శ్రీజగన్నాథుని నంది ఘోష్ మధ్యాహ్నం 2.35 గంటలకు సురక్షితంగా గమ్యం చేరాయి.

రథాలపై సేవాదులు

జన్మ క్షేత్రం గుండిచా మందిరం నుంచి అడపా మండపానికి మూల విరాటులను తరలించేంత వరకు నిత్య, ఉత్సవ, యాత్ర సేవాదులు, పూజార్చనలు సకలం రథాలపై నిరవధికంగా నిర్వహిస్తారు. మరో వైపు భక్తులకు రేయింబవళ్లు రథాలపై దేవుళ్ల దర్శనం సులభంగా లభిస్తుంది. శారదా బాలి సువిశాల ప్రాంగణం కావడంతో భక్తులు, యాత్రికులకు ఈ అవకాశం లభిస్తుంది.

మలేరియా విజృంభణ



విద్యార్థులకు వైద్య పరీక్షల నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హికక

రాయగడ: జిల్లాలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా విజృంభిస్తోంది. చాపకింద నీరులా కొనసాగుతున్న ఈ వ్యాధి తీవ్రతకు విద్యార్థులు సతమతమవుతున్నారు. సమాచారం అందుకున్న జిల్లా వైద్య శాఖ బృందాలు ఆశ్రమ పాఠశాలల్లో రక్త నమూనాలను సేకరించి సకాలంలో చికిత్స అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పరిధి బెల్‌కొన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో 15 మందికి మలేరియా సోకినట్లు నిర్ధారణ అయ్యింది. గత కొద్ది రోజులుగా ఈ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు కొంతమంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఒకరిని కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించి, అక్కడ పరీక్షించి చూడగా మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. దీంతో పాఠశాల నిర్వాహకులు వైద్య శాఖకు సమాచారం అందివ్వడంతో సోమవారం 118 మంది విద్యార్థుల రక్త నమూనాలను పరీక్షించారు. వారిలో 15 మంది విద్యార్థులకు మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అదేవిధంగా అంచలబడి గ్రామంలోని మరో ఆశ్రమ పాఠశాలలో 207 మంది విద్యార్థులకు మలేరియా పరీక్షలు నిర్వహించగా, వీరిలో 10 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. దీంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది.

పాఠశాల సందర్శించిన ఎమ్మెల్యే

ఈ నేపథ్యంలో బెల్‌కొన ఆశ్రమ పాఠశాలను బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక సందర్శించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉంటున్న హాస్టల్ గదికి వెళ్లి వారితో మాట్లాడారు. వ్యాధి ఇతరులకు సోకకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు.

ముగ్గురు నిందితులు అరెస్టు

జయపురం: స్థానిక భారత్ ఫైనాన్స్ ఉద్యోగి బాబగ్రీహీ బెహరని దోచుకున్న దుండగులను అరెస్టు చేసినట్లు జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి అంకిత వర్మ సోమవారం వెల్లడించారు. అరెస్టైనవారిలో నవరంగపూర్ జిల్లా బణియ గ్రామానికి చెందిన గుప్త హరిజన్, జయపురం సమితి కలాగుడ గ్రామానికి చెందిన వరుణ్ హరిజన్, నువాగుడ గ్రామానికి చెందిన జగదీష్ హరిజన్‌లు ఉన్నట్లు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 3వ తేదీన కలహండి జిల్లా జయపట్న పీఎస్ పరిధి బొడొటి డమన్ గ్రామానికి చెందిన భాబగ్రీహీ బెహర జయపురం సదర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులో భారత్ ఫైనాన్స్ కంపెనీలో తాను ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నానని, 3వ తేదీన జయపురం సమితి పాత్రోగుడ, నువాగుడ, గొడాపొదర్ గ్రామాల్లో రుణాల సొమ్ము వసూలు చేసి వస్తుండగా జయపురం సమీప పాత్రోగుడ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి తన వద్దనున్న డబ్బు బ్యాగ్‌ను లాక్కున్నారని వెల్లడించారు. బ్యాగ్‌లో రూ.73,255 నగదు, ట్యాబ్, బయోమెట్రిక్ డివైస్ ఉన్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితులు తమ నేరాన్ని ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి నగదు, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు.

బీజేడీలో సంస్థాగత మార్పులు



రమేష్ మజ్జి



ప్రదీప్ మజ్జి

కొరాపుట్: సార్వత్రిక ఎన్నికల తర్వాత బీజేడీ పార్టీలో సంస్థాగతంగా ఎటువంటి మార్పులు చేయలేదు. కానీ సోమవారం తొలిసారిగా ఆ పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నయక్ మార్పులు ప్రారంభించారు. రాష్ట్ర ఆఫీస్ బ్యారర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ ముఖ్యమైన రాష్ట్ర నాయకులను అధికార ప్రతినిధులుగా నియమించారు. ప్రదీప్ మజ్జిని పార్టీ కేంద్ర అధికార ప్రతినిధిగా, రమేష్ మజ్జిని రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి వీరిద్దరికి మాత్రమే పార్టీ పదవులు దక్కడం విశేషం. మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి రాష్ట్ర స్వతంత్ర మండలి సలహాదారుడుగా ఉంటూ నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానంలో పోటీచేసి ఓటమి పాలయ్యారు. నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న రమేష్ చంద్ర మజ్జి జొరిగాం ఎమ్మెల్యేగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. రమేష్ ప్రస్తుతం నబరంగ్‌పూర్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాజకీయంగా విరోధులైన వీరిద్దరికీ నవీన్ తొలి జాబితాలో పదవులు కేటాయించి సమన్యాయం పాటించారు.

చిల్లర లేదా.. నో ప్రాబ్లం..!



ఇప్పుడంతా డిజిటల్ యుగం నడుస్తోంది. చేతిలో క్యాష్ పెట్టుకోవడం కంటే స్మార్ట్ ఫోన్‌తో చెల్లింపులు చేయడానికే అందరూ ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో రథయాత్రకు ఎక్కడెక్కడ నుండో వస్తున్న బిచ్చగాళ్లు సైతం అప్డేట్ అవుతున్నారు. తాము కూడా యూపీఐ క్యూ ఆర్ కోడ్‌తో వృత్తిని కొనసాగిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చిన ఒక బిచ్చగాడు స్కానర్ పెట్టుకుని మరీ తన వృత్తిని కొనసాగిస్తున్న దృశ్యమిది.

– పర్లాకిమిడి

అతిసారతో ఒకరు మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సూర్య



తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్న ఖితా సునా

రాయగడ: జిల్లాలోని బిసంకట్ సమితి డిమిరిగుడ పంచాయతీలోని బొటొంగపాడొరొ గ్రామంలో అతిసారంతో ఒకరు మృతి చెందగా, మరో అరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వీరు ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతి చెందిన వ్యక్తి చిత్రొసునా కాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో నుగుడా సూర్య, ఖితొ సునాలు ఉన్నారు. గత కొద్ది రోజులుగా ఈ గ్రామంలో అతిసార వ్యాపించడంతో అనారోగ్యాలకు గురయ్యారు. వ్యాధితో ముందుగా జ్వరం వచ్చి, ఆ తర్వాత వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నామని గ్రామస్తులు తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న వైద్య బృందం గ్రామంలో సోమవారం పర్యటించింది. అనారోగ్యంతో ఉన్నవారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి మందులు అందజేసింది. గ్రామంలో కలుషితమైన నీటిని తాగేందుకు వినియోగించడంతో అతిసారం వ్యాపించి ఉంటుందని వైద్యులు భావిస్తున్నారు. గ్రామంలో ప్రజల తాగునీటి కోసం ప్రస్తుతం మంచినీటి ట్యాంకర్లను ఉపయోగిస్తున్నట్లు సమాచారం

పూరీ బీచ్‌లో రాష్ట్రపతి ముర్ము



ఉదయగిరి, ఖండగిరి గుహల సందర్శన

భువనేశ్వర్:

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పూరీ సందర్శన నేపథ్యంలో సోమవారం ఉదయం ఆమె కాసేపు ప్రకృతిని ఆస్వాదించారు. సాగర తీరంలో మార్నింగ్ వాక్ పురస్కరించుకుని సముద్ర తీరం వెంబడి నడుస్తున్నప్పుడు సున్నితమైన గాలి, అలల గర్జన, అపారమైన నీటి విస్తీర్ణ పరిసరాలతో ఒక మంచి అనుభూతి కలిగినట్లు ఆమె తెలిపారు. అనంతరం పూరీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత భువనేశ్వర్‌లోని చారిత్రాత్మక ఉదయగిరి గుహలను సందర్శించారు. ఈ గుహలు భారతీయ రాక్-కట్ ఆర్కిటెక్చర్ అరుదైన నమూనాలు. ఈ గుహలు సుమారు 1200 సంవత్సరాల నాగరికత, సాంస్కృతిక సంప్రదాయాలను ప్రదర్శిస్తున్నాయన్నారు. అనంతరం స్థానిక బిభూతి కనుంగో కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సంస్కృతి ఉత్కళ విశ్వ విద్యాలయం విద్యార్థులతో రాష్ట్రపతి సంభాషించారు. విద్యార్థులతో సంభాషించిన రాష్ట్రపతి ఒకనాడు దట్టమైన అడవులతో చుట్టబడి ఉన్న ఉదయగిరి పరిసరాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో అటవీ ఛాయలు కనుమరుగైపోయాయని విచారం వ్యక్తం చేశారు. అడవుల ఉనికి క్రమంగా కనుమరుగైపోయే విపత్కర పరిస్థితుల నుంచి బయటపడాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన రేపటి కోసం పర్యావరణాన్ని పరిరక్షించడానికి స్వల్ప, తేలికపాటి చర్యలు అలవరచుకోవాలని విద్యార్థులకు ప్రబోధించారు. కాలుష్యం కారణంగా సముద్రాలు, వివిధ రకాల వృక్ష మరియు జంతుజాలం తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో నివసించే ప్రజలు ఆవిష్కరించిన ప్రకృతి పరిరక్షణ సంప్రదాయాలను మార్గదర్శకంగా నేటి తరం అనుసరించాలని సూచించారు.



పూరీ సాగర తీరంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మార్నింగ్ వాక్



గుహల్లో ప్రాచీన శిలా సంపదను పరిశీలిస్తున్న రాష్ట్రపతి

క్లుప్తంగా

గిరి గోవర్ధన మందిర ప్రతిష్ఠోత్సవాలు


కలశ యాత్రలో పాల్గొన్న భక్తులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్‌లో గౌడో సమాజం ఆధ్వర్యంలో కొత్తగా నిర్మించిన గిరి గోవర్ధన మందిర ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు కలశ యాత్రను నిర్వహించారు. కాసీపూర్‌లోని పాత బ్యాంక్ నుంచి కొత్తగా నిర్మించిన మందిరం వరకు ఈ ర్యాలీ జరిగింది. సూర్య పూజతో ప్రారంభమైన కార్యక్రమం పుష్పాంజలి, హరతితో ముగిసింది.

‘ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలి’


జెడ్పీ వద్ద ధర్నా చేస్తున్న ఉత్తరాంధ్ర సాధన సమితి ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయాలని, రాజకీయ నిర్లక్ష్యం ఉండకూడదని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో మీకోసం హాల్ వద్ద సోమవారం ధర్నా చేశారు. 75 ఏళ్లుగా ఈ ప్రాంతం వెనుకబాటుకు గురైందని, ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ధర్నాలో వేమిరెడ్డి లక్ష్మున్నాయుడు, గోవిందరావు, వెంకటరమణ, అప్పారావు కూర్మానాయకులు తదితరులు ఉన్నారు.

‘విద్యార్థినులు అత్యున్నత స్థాయికి చేరుకోవాలి’


ఏఐసీటీఈ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందనాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థినులు అత్యున్నత స్థాయికి చేరుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు అన్నారు. కళాశాలలో సోమవారం 10వ తరగతి ప్రతిభ ఆధారంగా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఎంపిక చేసిన మెరిట్ స్కాలర్‌షిప్ 2024–25కి పొందిన ఏగురురు విద్యార్థినులు, రెన్యువల్ పొందిన విద్యార్థినులు 13 మందిని ప్రత్యేకంగా అభినందించారు. వీరికి రూ. 50 వేలు ఏడాదికి మెరిట్ స్కాలర్‌షిప్ అందుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు. ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు శ్రమించి చదవాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్నత అవకాశాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ విద్యలో యువతకు మంచి భవిష్యత్ లభిస్తుందని చెప్పారు.

జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

సోంపేట: రాష్ట్ర ప్రభుత్వం జీడిపంటకు గిట్టుబాటు ధర కల్పించి, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో జీడి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. 80 కిలోల బస్తాకు రూ.16 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో జీడి బోర్డులు ఏర్పాటు చేయాలని, స్థానిక జీడిపిక్కలు కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ జీడిపిక్కలకు అనుమతి ఇవ్వాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, మండల కన్వీనర్ సంగారు లక్ష్మీనారాయణ, పాతిన కృష్ణమూర్తి, పార్టీనాయకులు, రైతులు పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు బోల్తా


విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడిన కారు

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం గ్రామ సమీపంలో సోమవారం సాయంత్రం కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. మేఘవరం గ్రామానికి చెందిన గిన్ని మల్లేసు, పైల రాంబాబు అనే ఇద్దరు వ్యక్తులు కారులో టెక్కలి వైపు వస్తుండగా వారు వస్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. కారులో ఉన్న ఇద్దరూ స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.


పర్లాకిమిడి: గుండిచా మందిరంలో దేవతామూర్తులకు రంగులు అద్దుతున్న సేవాయత్‌లు


కొరాపుట్: కొటియాలో రథయాత్ర

అద్వితీయం

- రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజు కొనసాగిన రథయాత్ర

రాష్ట్రవ్యాప్తంగా దేవదేవుడి రథయాత్ర రెండోరోజు సోమవారం కొనసాగింది. ఆదివారం సాయంత్రం యాత్ర ప్రారంభమవ్వగా సూర్యాస్తమయం కావడంతో నిలిచిన రథాలు, మరలా సోమవారం అశేష భక్తజనం మధ్య కదిలాయి. అనంతరం జై జగన్నాథ నినాదాలు మధ్య గుండిచా మందిరానికి చేరుకున్నాయి. పలుచోట్ల ఆదివారమే గుండిచా మందిరానికి జగన్నాథుడు చేరుకున్నాడు. దీంతో అంతటా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఇకపై జగన్నాథుడు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నాడు.

– సాక్షి నెట్‌వర్క్


కొరాపుట్: దమంజోడిలో రథయాత్ర


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో రథయాత్ర


కొరాపుట్: దండాముండాలో జరిగిన రథయాత్రలో రమేష్ మజ్జి, ప్రకాష్ మజ్జి


కొరాపుట్: రథయాత్రలో పాల్గొన్న కలెక్టర్ వి.కీర్తివాసన్, చైర్మన్ లలెటెందు శెరి


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో రథం లాగుతున్న యువత


కొరాపుట్: దేవదేవుడిని దర్శించుకుంటున్న భక్తజనం


కొరాపుట్: కొటియాలో గిరిజన మహిళలు నృత్యాలు


కొరాపుట్: సునాబెడా రథంపై పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రఘురాం మచ్చో


కొరాపుట్: సిమిలిగుడలో రథయాత్ర


కొరాపుట్: రథం లాగుతున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు


రాయగడ: మత్స్యావతారంతో దర్శనమిస్తున్న జగన్నాథుడు


పర్లాకిమిడి: రథయాత్రలో భక్తి సంగీత కార్యక్రమం


జయపురం: రథయాత్రలో భజనలు చేస్తున్న భక్తులు


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో రథం లాగుతున్న ఎమ్మెల్యే గౌరీ శంకర మజ్జి


కొరాపుట్: కొటియా రథయాత్రలో ఎంపీ సప్తగిరి ఉల్క, పొట్టంగి ఎమ్మెల్యే రాం ఖడం


జయపురం: రథం లాగేందుకు సిద్ధమవుతున్న భక్తులు


జయపురం: రథొపొడియ నుంచి బయల్దేరిన రథం


కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో దేవదాయ సిబ్బందితో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి తదితరులు


జయపురం: భక్తులకు దర్శనమిచ్చిన దేవతామూర్తులు

ఒలింపిక్ క్రీడాకారులకు ప్రోత్సాహం



అమిత్ రోహిదాస్



కిషోర్ కుమార్ జెనా

భువనేశ్వర్:

వచ్చే పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే రాష్ట్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్ఫూర్తిదాయకమైన చర్యగా, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సోమవారం అథ్లెట్లకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహం ప్రకటించారు. ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు పారిస్‌లో జరగనున్న ఒలింపిక్ క్రీడల్లో పాల్గొంటున్న జావెలిన్ త్రోయర్ కిషోర్ కుమార్ జెనా, హాకీ క్రీడాకారుడు అమిత్ రోహిదాస్‌లకు ప్రోత్సాహం ప్రకటించారు. వీరివురి అత్యుత్తమ ప్రదర్శనలు దేశానికి కీర్తిని తీసుకురావడానికి దోహదపడతాయన్నారు. కిషోర్ జెనా, అమిత్ రోహిదాస్‌లు పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించడం తమ మాతృభూమికి మాత్రమే కాకుండా, యావత్ దేశానికి గర్వకారణమన్నారు. జగన్నాథుని ఆశీస్సులతో ఒలింపిక్స్‌లో తమ అసాధారణ క్రీడా నైపుణ్యాల ద్వారా రాష్ట్రానికి, దేశానికి గౌరవంగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు.

ఎస్‌ఎఫ్‌ఓఏ ఉపాధ్యక్షుడిగా బి.గోపాల్

పలాస: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ ఆఫీసర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బోనెల గోపాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు, శ్రీకాకుళం ఫార్మసీ నాయకుడు సోమేశ్వరరావు, చక్రవర్తి, సుబ్రహ్మణ్యం, మల్లేశ్వరరావు, విజయ్‌మోహన్, గోవింద నాయుడు, నరసింహరావు, తులసి, దుర్గ, జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మిషన్ శక్తి సంకల్ప్ పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో మహిళల అభ్యున్నతికి మిషన్ శక్తి సంకల్ప్ (మహిళా సాధికారత కేంద్రం), భారతీయ న్యాయ సంహిత మొదలైన వాటిపై అవగాహన కల్పించే వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ అవగాహనా కార్యక్రమాలు జూన్ 21 నుంచి అక్టోబరు 4 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయి, మండల స్థాయి, ప్రాజెక్టు పరిధిలో, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

మనసులు గెలిచారు..!



సమయానుకూలంగా సంస్కారవంతంగా మెలగాలనే అమూల్య పోకడని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత విపక్ష నేత నవీన్ పట్నాయక్ ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఆదివారం పూరీ శ్రీజగన్నాథుని రథయాత్రకు ఏటా మాదిరిగా ఆయన హాజరయ్యారు. అప్పటికే ప్రముఖులు వేదికని అలంకరించి యాత్ర తిలకించడంలో నిమగ్నమై ఉన్నారు. వేదిక కింద నుంచి పైనున్న రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్, స్పీకర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్రమంత్రికి నవీన్ పట్నాయక్ నిలువెత్తున నమస్కరించి అందరి మనసు దోచుకున్నారు. వెంటనే వేదికపై ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తక్షణమే లేచి నిల్చుని వేదికపైకి రావాల్సిందిగా సాదరంగా ఆహ్వానించారు. మరుక్షణమే కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వేదిక పైనుంచి దిగి వచ్చి విపక్ష నేత నవీన్ పట్నాయక్‌కు సాదరంగా వేదికపైకి తీసుకెళ్లారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఇటువంటి సంస్కారం కూడా ఎంతైనా అవసరమని అక్కడున్న నాయకులంతా ప్రస్తుత తరాలకు ప్రత్యక్షంగా రుజువు చేశారు. ఉన్నత సంస్కార విలువలు జీవితంలో ఒక మెట్టును ఎక్కిస్తాయని ఈ సన్నివేశం రుజువు చేసింది. నేటి తరం ప్రజలు, ప్రజా ప్రతినిధులకు ఇదొక చక్కటి సంస్కార సందేశంగా నిలిచింది.

– భువనేశ్వర్

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో ఒకే చిన్నారి



రామవరం కేంద్రం-3 లో ఉన్న ఒకే ఒక్క చిన్నారి

గంట్యాడ: మండలంలోని రామవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఒకే ఒక్క చిన్నారి సోమవారం కనిపించింది. ఉదయం 10:30 గంటల సమయంలో అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త గాని, ఆయా కానీ లేరు. కేవలం ఒక చిన్నారి మాత్రమే ఆడుకుంటూ కనిపించింది. కేంద్రం పరిధిలో ఆరుగురు పిల్లలు ఉండగా కేవలం ఒక చిన్నారి మాత్రమే హాజరు కావడం గమనార్హం. ఇదేవిషయాన్ని సీడీపీఓ డోకుల ఉమా భారతి వద్ద సాక్షి ప్రస్తావించగా కార్యకర్త మెడికల్ లీవులో ఉందని, ఆయా కేంద్రంలో ఎందుకు లేదో విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జ్వరపీడితులకు డీఎంహెచ్‌ఓ పరామర్శ

- కాలంరాజుపేట సందర్శన



కాలంరాజుపేట వీధుల్లో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

తెర్లాం: మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో కొన్ని రోజులుగా విజృంభిస్తున్న విషజ్వరాలను అదుపులోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌ఓ) బి.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు కాలంరాజుపేట గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించి గ్రామంలో విషజ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి జ్వరాలు రావడానికి గల కారణాలను సర్పంచ్ రావిపల్లి రమణమూర్తితోపాటు, గ్రామస్తులతో చర్చించారు. ప్రజలకు జ్వరాలు వచ్చినప్పటి నుంచి గ్రామంలో పెరుమాళి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారా? లేదా? మందులు పంపిణీ చేస్తున్నారా? లేదా? రక్తపరీక్షలు చేశారా? లేదా? అని బాధితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గొర్రెలు, మేకల శాలలు ఇళ్ల పరిసరాల్లో ఉండకుండా ఊరికి దూరంగా శాలలు ఏర్పాటు చేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మంచినీటి పథకంలో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు సోకినవి కేవలం వైరల్ జ్వరాలు మాత్రమేనని, డెంగీ జ్వరాలు కాదని కొట్టిపారేశారు. గ్రామానికి చెందిన అప్పమ్మ ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో మరణించిందని, జ్వరంతో మరణించలేదని స్పష్టంచేశారు. గ్రామంలో కొద్ది మందికి ఇంకా జ్వరాలు ఉండడంతో వైద్య శిబిరం కొనసాగిస్తామని, జ్వరాలు పూర్తిగా అదుపులోకి వచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న జ్వరపీడితులను అక్కడికి వెళ్లి పరామర్శించారు. ఆయనతో పాటు జిల్లా మలేరియా అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పెరుమాళి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వెంకటేష్, సిబ్బంది, ఈఓపీఆర్‌డీ నీలిమ, పంచాయతీ కార్యదర్శి మధు తదితరులు ఉన్నారు.

మత్స్య, కూర్మ అవతారంలో జగన్నాథుడు



పూజలందకుంటున్న జగన్నాథుడు

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక కోళ్ల బజారులో కొలువైన స్వామివారు సోమవారం మత్స్య, కూర్మ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామికి అర్చకులు నగేష్ ఆచార్యులు, వెంకటరమణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

హెల్మెట్ తప్పనిసరి

పార్వతీపురంటౌన్: ద్విచక్ర వాహన ప్రయాణికులు అందరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్, పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదర రావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 26న డబ్ల్యూ.పి నంబరు (పిల్) 116/2024 పై హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, ద్విచక్ర వాహన ప్రయాణికులు అందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తద్వారా సంభవించే ప్రమాదాలను అరికట్టాలని కోరారు.

ఈ పా'పాలు' ఎవరివి?

- అంగన్‌వాడీ కేంద్రాలకు నిలిచిపోయిన పోషకాహారం సరఫరా
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు
- మొత్తం లబ్ధిదారులకు నెలకు 2,68,797 లీటర్ల పాలు అవసరం



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు అందించే పాలు



గంట్యాడ మండలం నరవ గ్రామంలో ప్రీస్కూల్ కిట్‌తో ఆడుకుంటున్న పిల్లలు

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహార లోపం బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు అందిస్తున్నారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారంతో పాటు పాలు అందిస్తారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు పాలను వారి ఇళ్లకే అందజేస్తారు. అయితే జూలై నెలకు సంబంధించి లబ్ధిదారులకు అందించాల్సిన పాలు ఇంతవరకు అంగన్‌వాడీ కేంద్రాలకు చేరలేదు. దీంతో లబ్ధిదారులు పాల కోసం ఎదురుచూస్తున్నారు. లబ్ధిదారులు పాలు అడుగుతుంటే ఏం చెప్పాలో తెలియక అంగన్‌వాడీ కార్యకర్తలు సతమతమవుతున్నారు.

జిల్లాలో లబ్ధిదారుల వివరాలు

జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో గర్భిణులు 8829 మంది, బాలింతలు 7485 మంది, 3నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 74,891 మంది ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు ప్రతిరోజూ గుడ్డు, రోజుకో పప్పు లేదా కూరగాయలతో కూడిన భోజనం 100 మి.లీ పాలు ఇస్తారు. గర్భిణులు, బాలింతలకు బెల్లం, వేరుశనగ చెక్కీలు, రాగి పిండి, అటుకులు, ఖర్జూరంతో పాటు, ఐదు లీటర్ల పాలను నెలకు సరిపడా ఇంటికి ఇస్తారు.

నెలకు 2,68,797 లీటర్ల పాలు అవసరం

గర్భిణులు, బాలింతలు ఒక్కొక్కరికి నెలకు 5 లీటర్లు చొప్పున పాలను అందిస్తారు. అదేవిధంగా 3 నుంచి 6 సంవత్సరాల వారికి రోజుకు 100 మి.లీ లీటర్లు పాలు ఇస్తారు. ఈలెక్కన మొత్తం లబ్ధిదారులకు 2,68, 797 లీటర్లు పాలు నెలకు అవసరం పడతాయి. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులు అంతా పేద, మధ్యతరగతికి చెందిన వారే. వారికి ఈ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం ఎంతగానో ఉపయోగపడుతుంది.

విచారణ చేసి చర్యలు

నాకు తలకు గాయం కావడం వల్ల రెండు వారాలుగా సెలవులో ఉన్నాను. ఈరోజే విధుల్లో చేరాను. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు సరఫరా కాకపోవడంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి

అక్రమ మైనింగ్‌ను సహించేది లేదు

- తహసీల్దార్లు, ఆర్డీవోలే అక్రమ మైనింగ్‌ను నియంత్రించాలి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



కలెక్టరేట్ నుంచి ఆన్‌లైన్‌లో తహసీల్దార్లతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని పలు మండలాల్లో అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుగుతున్నట్టు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, ఇకపై జిల్లాలో ఎక్కడా అక్రమ మైనింగ్ కార్యకలాపాలను సహించేది లేదని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో పాటు ఆన్‌లైన్‌లో మండల స్థాయి అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు ఆదేశాలిచ్చారు. మండల పరిధిలో జరిగే అక్రమ మైనింగ్‌పై తహసీల్దార్లు, ఆర్డీఓలు నిఘా పెట్టి వాటిని నిరోధించాలని సూచించారు. అక్రమ మైనింగ్ జరిగినట్టు ఫిర్యాదులు వస్తే తహసీల్దార్లనే బాధ్యులను చేస్తానని హెచ్చరించారు. జిల్లాలో నాసిరకం విత్తనాలు విక్రయించకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ జేడీని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.డి.అనిత, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల తనిఖీకి ఆదేశం

విజయనగరం అర్బన్: జిల్లాలోని అన్ని పరిశ్రమలూ భద్రతా ప్రమాణాలను విధిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమల్లో ఎక్కడా ఒక్క ప్రమాదం కూడా సంభవించడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని సిమెంట్ పరిశ్రమలో ఆదివారం సంభవించిన ప్రమాదం నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై కలెక్టర్ సోమవారం సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా పరిశ్రమల్లో తనిఖీలు చేయాలని, ముందుగా జిల్లాలో ఉన్న 65 ప్రమాదకర పరిశ్రమలను వెంటనే తనిఖీ చేయాలని రెవెన్యూ, పోలీస్ శాఖలను ఆదేశించారు. ప్రతి పరిశ్రమను తహసీల్దార్, ఎస్‌హెచ్‌ఓ సంయుక్తంగా మంగళవారం నుంచి తనిఖీ చేసి, మూడు రోజుల్లో నివేదికలను సమర్పించాలని సూచించారు. అగ్నిమాపక అధికారులు కూడా విడిగా ఈ పరిశ్రమలను తనిఖీ చేసి 15 రోజుల్లో నివేదిక అందజేయాలన్నారు. జిల్లాలోని 540 చిన్నాపెద్దా పరిశ్రమలను సైతం దశలవారీగా తనిఖీలు చేయాలని రెవెన్యూ, పోలీస్ శాఖలకు సూచించారు. పరిశ్రమల్లో కార్మికులకు వేతనాల చెల్లింపు, వారి సంక్షేమానికి తీసుకున్న చర్యలను పరిశీలించి నివేదిక అందజేయాలని కార్మికశాఖ అధికారులను ఆదేశించారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం

విజయనగరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో 70 మంది క్రీడాకారులు పాల్గొనగా... ఓపెన్ విభాగంలో కాండ్రేగుల సోమనాథ్, ప్రహ్లాద్, లిఖిత కృష్ణ, పి.భరణ్, బి.సాయి సుదర్శన్‌లు విజేతలుగా నిలిచారు. అండర్-07, 09, 11, 13 వయస్సుల విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 24 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరందరికీ ప్రత్యేక బహుమతులు అందజేశారు. న్యాయవాది టి.రాజు, అర్చన, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

'విజయ'పరంపర



విజయోత్సాహంలో విజయనగరం జట్టు

- అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో అనంతపురంపై 6 వికెట్ల తేడాతో గెలుపు

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జి క్రికెట్ మైదానంలో ఈనెల 2 నుంచి నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విజయనగరం జిల్లా జట్టు విజయపరంపర కొనసాగిస్తోంది. అనంతపురం జిల్లా జట్టుతో ఈనెల 6న ప్రారంభమైన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొంది రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 129 పరుగులకు ఆలౌట్ కాగా, విజయనగరం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డి.ఫణీంద్ర (106 పరుగులు) సెంచరీ సాధించగా ఎ.జశ్వంత్, కెప్టెన్ కె.బాల మణికంఠలు అర్ధసెంచరీలు సాధించారు. రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 241 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 67 పరుగుల స్వల్ప లక్ష్యంతో మూడో రోజు సోమవారం మధ్యాహ్నం బరిలోకి దిగిన విజయనగరం జిల్లా జట్టు నాలుగు వికెట్లు నష్టపోయి 69 పరుగులు సాధించి రెండో విజయం తన ఖాతాలో వేసుకుంది. విజయం సాధించిన విజయనగరం జిల్లా జట్టును, కోచ్ బహదూర్‌ను, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి సీతారామరాజు, సెలెక్టర్లు వర్మ, సర్ఫరాజ్, బంగారరాజులు అభినందించారు.

లారీ ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన ఎల్లయ్యమ్మ (ఫైల్)

గజపతినగరం: మండలంలోని పురిటిపెంటలో నివాసం ఉంటున్న బేతల ఎల్లయ్యమ్మ (63) లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆమె పురిటి పెంట నుంచి అవసరాల నిమిత్తం సోమవారం ఉదయం గజపతినగరం వస్తున్న సమయంలో మెంటాడ జంక్షన్ రోడ్డులో లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని కేంద్రాస్పత్రికి తరలించారు.అక్కడ వైద్యసేవలు పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. దీంతో లారీని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గాయపడిన వ్యక్తి..

గంట్యాడ: మండలంలోని కొర్లాం టోల్ గేట్ వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెలవారుజామున ఎస్.కోటకు చెందిన కందిపల్లి సత్యం(45) మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై సురేంద్ర నాయుడు విలేకరులకు తెలిపారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గంట్యాడకు చెందిన మణికంఠ విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించాలి



సర్వేలో గుర్తించిన గణేశ్వరరావు

పార్వతీపురం: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య కోఆర్డినేటర్ అమ్మినాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలో నిర్వహించిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఇందులో భాగంగా జియ్యమ్మవలస మండలం పెద బుడ్డిడి గ్రామానికి చెందిన 11ఏళ్ల కెల్ల గణేశ్వర రావును ఇంతవరకు పాఠశాలలో నమోదు కాకుండా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా గణేశ్వర రావుకు ప్రత్యేక ఉపాధ్యాయులతో ఇంటివద్దే విద్యను అందించాలని జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ పి.భానుమూర్తికి ఆదేశాలు జారీచేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ బి.శ్రీనివాసరావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ ఎస్. మధుకిశోర్, బి. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మంచం పట్టిన ఓబలయ్యపాలెం




జ్వరంతో బాధపడుతున్న రాములమ్మ, ఓ చిన్నారి



ఓబలయ్యపాలెంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

వేపాడ: మండలంలో ఓబలయ్యపాలెం వాసులు జ్వరాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఏ ఇంటిలో చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. గత వారంరోజులుగా జ్వరాలు వ్యాప్తి చెందినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని గొల్లవీధి, యాతవీధి, కాపు వీధుల్లో జ్వరాల తాకిడి ఎక్కువగా ఉంది. గ్రామానికి చెందిన ఎస్.మోహన్‌కుమార్, రాములమ్మ, బి.చరణ్, బి.అప్పలనాయుడు, అభిరామ్, సునీత, దినేష్, సత్యవమ్మ తదితరులు జ్వరాలతో మంచంపట్టారు. వైద్యసేవలు పొందిన వెంటనే జ్వరాలు తగ్గుతున్నాయని, కీళ్ల నొప్పులు వారం పదిరోజుల వరకు తగ్గడం లేదని జ్వరపీడితులు చెబుతున్నారు. బొద్దాం పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటుచేసి సేవలు అందించారు. తాగునీటి కాలుష్యమే జ్వరాల వ్యాప్తికి కారణంగా తెలుస్తోందని, జ్వర పీడితులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్టు వైద్యాధికారి రమాదేవి తెలిపారు.

• కలెక్టరేట్ ఎదుట ధర్నా



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

పార్వతీపురం: గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన గిరిజన మహిళలు సోమవారం కలెక్టరేట్‌కు ఖాళీ బిందెలతో వచ్చి నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వారంతా వచ్చి వారం రోజుల్లో బుడ్డిడి గూడ, బాడంగి గూడ, జలుబు గూడ, తదితర గిరిజన గ్రామాలకు తాగునీరు సౌకర్యం కల్పించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని కురుపాం మండల కమిటీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు మండంగి శ్రీనివాసరావు హెచ్చరించారు. అలాగే కాకిలి జంక్షన్ నుంచి బుడ్డిడి గూడకు, బుడ్డిడి గూడనుంచి బాడంగి గూడకు, జలుబు గూడకు, రెల్లిగూడ నుంచి తాడిగండకు, మామిడి గూడ నుంచి కేదారి లంకకు, బీటీ రోడ్లు వేయాలని పలువురు ఆయా గ్రామాల గిరిజనులు కోరారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాలను కలెక్టర్‌కు అందజేశారు.

ఇసుక సరఫరా ప్రారంభం



డెంకాడ మండలం పెదతాడివాడ స్టాక్ యార్డులో సిద్ధంగా ఉన్న ఇసుక

- సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు
- ఫిర్యాదుల స్వీకరణకు కాల్‌సెంటర్ నంబర్: 90323 38135

విజయనగరం అర్బన్:

జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికోసం జిల్లాలో మూడు ఇసుక స్టాక్ యార్డులను గుర్తించారు. ఇక్కడ ఇప్పటికే నిల్వ ఉన్న ఇసుకను ట్రాక్టర్లు, లారీలకు జేసీబీలతో లోడింగ్ చేయించి సరఫరా చేపట్టారు. కార్యక్రమాన్ని ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రారంభించారు. డెంకాడ యార్డులో ఉచిత ఇసుక సరఫరా కార్యక్రమాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేకపోవడంతో డెంకాడ మండలం పెదతాడివాడ, బొబ్బిలి గ్రోత్ సెంటర్, కొత్తవలస వద్ద ఇసుక స్టాక్ యార్డులు ఏర్పాటు చేశారు. కొత్తవలసలో 11,805 మెట్రిక్ టన్నులు, డెంకాడలో 9,756 మెట్రిక్ టన్నులు, బొబ్బిలిలో 72,466 మెట్రిక్ టన్నులు మొత్తం సుమారు 92 వేల టన్నుల ఇసుక ఇప్పటికే సిద్ధంగా ఉండడంతో ఆయా స్టాక్ యార్డుల నుంచి సరఫరా ప్రారంభమైంది. రవాణా వ్యయం, హ్యాండ్లింగ్ చార్జీల కింద మెట్రిక్ టన్నుకు రూ.605 చొప్పున వసూలు చేస్తున్నారు. వినియోగదారులే సొంతంగా వాహనాలను స్టాక్ యార్డుకు తెస్తే ఇసుకను ఉచితంగా సమకూర్చుతున్నారు. ఒక వ్యక్తికి రోజుకు గరిష్ఠంగా 20 టన్నుల ఇసుకను మాత్రమే సరఫరా చేయాలని ప్రభుత్వం నిబంధన విధించింది. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్టాక్ యార్డుల్లో ఇసుక సరఫరా జరుగుతోంది. తీసుకున్న ఇసుకకు తప్పనిసరిగా బిల్లు జారీ చేస్తారు. ప్రతిస్టాక్ యార్డు వద్దా వీఆర్వో, వీఆర్ఏ, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఉండి ఇసుక సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదులు స్వీకరించేందుకు 24 గంటలు పనిచేసేలా సెల్: 90323 38135 నంబర్‌తో కాల్‌సెంటర్ అందుబాటులోకి వచ్చింది.

అర్జీదారులతో కలెక్టరేట్ కిటకిట



మూడంచెల వినతుల నమోదు కేంద్రాల్లో ప్రజల రద్దీ

- వినతుల సమర్పణకు బారులు తీరిన ప్రజలు



దివ్యాంగురాలి అర్జీని వింటున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రజలతో సోమవారం కలెక్టరేట్ కిటకిటలాడింది. ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేపట్టారు. కలెక్టర్ వద్దకు వినతి వెళ్లడానికి మూడు అంచెలుగా నమోదు ప్రక్రియ జరుగుతుంది. అయితే సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో మూడు అంచెల కౌంటర్ల ఎదుట భారీగా ప్రజలు క్యూకట్టారు. రెవెన్యూ సమస్యలు, వైద్యశాఖలో ఉద్యోగాల కుదింపుతో బాధితులు, చేయూత పథకం అందనివారు, పెన్షన్ రద్దు చేశారని వచ్చిన వారు, ఇలా పథకాలు అందని వారి సంఖ్య అధికంగా కనిపించింది. ఈ సందర్భంగా కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు ముందుగా మండల కేంద్రంలో తహసీల్దార్ లేదా ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతులు ఇవ్వాలని అక్కడ పరిష్కారం కాని పక్షంలో డివిజన్, జిల్లా కేంద్రాల్లో తదుపరి వినతులు ఇవ్వొచ్చని సూచించారు. జిల్లా కేంద్రంలో వాటిని అందజేసినప్పటికీ మళ్లీ పరిష్కారం కోసం మండల అధికారులకే పంపించాల్సి ఉంటుందని అందువల్ల అర్జీదారులంతా మండలస్థాయిలోనే పరిష్కరించుకోగలిగే సమస్యలపై అక్కడే వినతులు ఇవ్వాలని సూచించారు. ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎం.వి.సూర్యకళ 186 వినతులు స్వీకరించారు.

అందుబాటులో లేని కొత్తవలస తహసీల్దార్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలను వెంటవెంటనే సంబంధిత మండల స్థాయి అధికారులతో ఆన్‌లైన్‌లో సమీక్షించే శైలిని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ గత వారం నుంచి అమలులోకి తెచ్చారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమ సమయంలో కలెక్టర్‌కు అధికారులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండాలి. సోమవారం వచ్చిన ఓ వినతి పరిష్కారం కోసం కొత్తవలస తహసీల్దార్‌తో కలెక్టర్ మాట్లాడాల్సి వచ్చింది. అయితే తహసీల్దార్ విధుల్లో ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో అందుబాటులో లేకపోవడంతో తహసీల్దార్‌పై కలెక్టర్ సీరియస్ అయ్యారు.

ఎస్పీకి 44 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి 44 ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్బీ సీఐ ఈ.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.